# పాదయాత్ర

-బృందావనరావు

ఉన్నట్టుండి సుబ్బరాజు గారికి ఓ ఆలోచన వచ్చింది. నాయకుడికి ఏం ఆలోచనలొస్తాయి. ఎప్పుడు ఏ ఆలోచన వచ్చినా రెండే రెండు ప్రయోజనాలను ఆశించి వస్తాయి. ఆ ప్రయోజనాలను నెరవేర్చేవే వస్తాయి. మొదటి ప్రయోజనం ఎలాగోలా ఎన్నికల్లో గెలవడం. ఈ రెండు ప్రయోజనాలూ పరస్పరాశ్రితాలు. ఎన్నికల్లో గెలిచి పవరు దొరకబుచ్చుకుంటే డబ్బు సంపాదించడం కష్టం కాదు. డబ్బు బాగా సంపాదిస్తే ఎన్నికల్లో గెలవడమూ కష్టం కాదు. రాజకీయాల్లో ఉన్నవాళ్లకు ఈ రెండూ సంపాదించుకోవడానికి ఏదో ఒక ఎత్తు వేస్తూనే వుండాలనే సంగతి బాగా తెలిసిందే.

ఏదో రకంగా జనంలో తన పేరు నానుతూ వుంటేనే పార్టీ హైకమాండు కూడా తనను గుర్తుంచుకుంటుంది. తన పేరు జనంలో మోగుతూ వుండాలంటే ఏదో ఒక హడావుడి చెయ్యాలి. ఏం చేద్దామా అని ఆలోచిస్తున్నాడు సుబ్బరాజు. ఎన్నికలొస్తున్నాయి. ఎన్నికలంటేనే ఎన్నెన్నో కలలు. మరెన్నెన్నో వలలు.

దేశంలో జనం మాత్రం తెలివి మీరి పోయారని కొంతమంది అనుకుంటునానరు. కానీ సుబ్బరాజు అంచనా వేరు. వాండ్ల మొహం, జనానికేం తెలుసు. ఓ వెయ్యిమందో, రెండువేల మందో తెలివిగా ప్రవర్తించొచ్చు. కానీ వోటర్లు నియోజకవర్గంలో లక్షల్లో వుంటారు. మెజారిటీ జనం గొర్రెలే. కాకపోతే తను రెండు టెరములు ఎమ్మెల్యే ఎలా కాగలిగాడు. ప్రతిసారీ ఏదో ఒక ఇష్యూ తీసుకుని గోలచేస్తాడు. జనాన్ని రెచ్చగొడతాడు. ఆ విషయం, ఎన్నికలైందాకా జనం మనసుల్లో రగుల్తూనే వుండేటట్టు జాగ్రత్తలు తీసుకుంటాడు. ఆ వేడిలో అదో సెంటిమెంటయిపోయి తనకే వోట్లు గుద్దేస్తారు జనం. అయితే కొందరు మహా తెలివిగలవాళ్లుంటారు. వాళ్లు ఏ సెంటిమెంటుకూ లొంగరు. వారి కోరికలు వారికుంటాయి. అవి తీర్చాలి. అన్ని కోరికలూ తీర్చేది డబ్బేగదా. అది వెదజల్లాలి. ఎన్నికల టైంలో డబ్బుకు వెనకాడితే కుదరదు. ఎవడికి ఏది కావాలంటే అది ఇవ్వడానికి సిద్ధమైపోవాలి. ఎలక్షన్ విషయంలో ఛాన్సు తీసుకునే వీలేలేదు. ఛాన్సుకు ఛాన్సిచ్చామో, వికటించిందంటే మళ్లా ఐదేళ్ల దాకా మాట్లాడ్డానికి వీల్లేదు. ఐదేళ్ల తర్వాత చూసుకుందామంటే అప్పటికి పరిస్థితులెలా ఉంటాయో! గెల్చిన కొత్త నాయకుడు అప్పటికి ఏకు మేకైతే అదో తలనొప్పి. "నందో రాజా భవిష్యతి" అని అనుకోవడానికి ఏమాత్రం వీలులేని రంగం ఏదైనా వుందంటే అది రాజకీయ రంగమే. ఎప్పుడు ఎవరు పొగపెడతారో కాచుకుని వుండాలి. తన అడ్డాలో వుండే వోటరు గొర్రెలు పక్క అడ్డాలోకి పోకుండా కనిపెట్టుకొని వుండాలి. నిత్యమూ జనం నోళ్లలోనూ, పేపర్ల పేజీల్లోనూ నానుతూ వుండాలి. పార్టీలో పైనున్న నాయకులకు కోపం రానీకుండా వాళ్ళ ప్రసన్నత పల్చబారకుండా చూసుకుంటుండాలి. ఈ అష్టావధానాలన్నీ చేస్తూ ఎక్కడ వీలుంటే అక్కడ సాధ్యమైనంత నొక్కేస్తూ ఎలక్షన్ల ఖర్చులకు కొంత వేర్వేరు పద్దుల్లో జమ అవుతూనూ వుండాల. దాదాపు పన్నెండేళ్లనించీ రాజకీయాల్లో రాటుదేలిపోయిన సుబ్బరాజు- ఏడేసి బంతులను ఏకకాలంలో కింద పడకుండా ఎగరేసి పట్టుకునే మెజీషియన్ లాగా - బాగా అనుభవం గడించాడు.

స్వాతంత్ర్య పోరాటంలో దేశంలోని చాలా ప్రాంతాల్లోని దేశభక్తులు నిస్వార్థంగా పాల్గొన్నారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. జైళ్లలో బాధలు అనుభవించారు. గాంధీ గారి ఆదేశాల ప్రకారం చదువులు మానేసి, వృత్తులు మానేసి సత్యాగ్రహాలు చేసి ఎన్నో కష్టాలను అనుభవించిన నిస్వార్థ దేశభక్తులు ఎంతోమంది వున్నారు. అటువంటి దేశభక్తుడే సుబ్బరాజు గారి నియోజకవర్గంలో ఒకడుండేవాడు. ఆయన పేరు

## కనుల వెలుగు

నాట్యం
చేస్తున్న శివపార్వతుల్లా
శ్రీశ్రీ అనే
రెండక్షరాలు
కనులకు వెలుగు
జ్ఞానానికి మెరుగు

-సింగిడి రామారావు

వంగర గోపాలకృష్ణయ్య గారు. గాంధీగారితో సబర్మతీ ఆశ్రమంలో కొన్ని రోజులున్నాడు. ఉప్పు సత్యాగ్రహం కాలంలో తన తాలూకాలో సముద్రపు ఒడ్డుకు జనాన్ని నడిపించి, ఉప్పు పండించి అరెస్టయి చాలాకాలం జైల్లో ఉన్నాడు. జిల్లాలో ఏ ఉద్యమం జరిగినా ముందుండే వాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ఆ తొలి రోజుల్లో ఆయనకు ఎమ్మెల్యేగా నిలుచునేందుకు సీటిస్తామంటే, నేను పదవి కోసం పోరాటం చెయ్యలేదు, నా దేశం కోసం చేశాను అంటూ తిరస్కరించాడు. ఆ జిల్లాలో ఆయనకు గొప్ప పేరుంది. ప్రజల దృష్టిలో ఆయన దేవుడిలాంటి మనిషి. ఆ తర్వాత ఆయనకు ప్రభుత్వం తామ్రపత్రం ఇచ్చి, స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో రెండెకరాల భూమి కూడా ఇచ్చింది. అయితే ఆ భూమి మీద వచ్చే పంట ఏడాదైనా తినకుండానే ఆయన పోయాడు. కానీ ఆయన కీర్తి మాత్రం మాసిపోలేదు. చాలామంది నడికారు జనానికి ఆయనంటే అభిమానం ఇంకా పచ్చగానే ఉంది. ఆయన భార్య, దాదాపు ఎనభై ఏళ్ళావిడ బతికే వుంది, తినడానిగ్గూడా జరుగుబాటు లేని దశలో.

జనంలో తన ఎడ తగ్గుతున్న అభిమానాన్ని తిరిగి పూరించుకోడానికి ఏంచేయాలా అని ఆలోచించే సుబ్బ రాజుకు వంగర గోపాలకృష్ణయ్య గారు జ్ఞాపకానికి వచ్చారు. జనానికి ఆయన మీద వుండే అభిమానాన్ని, తనకు ఓట్లు తెచ్చిపెట్టే సాధనంగా ఎలా మార్చు కోవాలా అని ఆలోచించాడు సుబ్బరాజు.

నియోజకవర్గంలో ఊరూరా సుబ్బరాజు అభిమాన సంఘాలను ఏర్పరచుకున్నాడు. ప్రతి ఊళ్లోనూ స్కూల్ డ్రాపౌట్లు, రికామీగా తిరిగే యువకులు ఆ బ్రిగేడ్లల్లో సభ్యులు. సుబ్బరాజు గారి ఆదేశానుసారం అవసర మైనప్పుడల్లా ధర్నాలూ, రాస్తారోకోలూ నిర్వహించడం, బహిరంగ సభలకు జనాన్ని తోలడం, సుబ్బరాజుకు జిందాబాద్‌లు కొట్టడం, సుబ్బరాజును విమర్శించిన వారి దిష్టిబొమ్మలు తగలబెట్టడం – ఇవీ ఈ అభిమా నుల కార్యక్రమాలు. 'ఉన్నది పుష్టి మానవులకు' అన్నట్టు, ఇలాంటి పరివార సమూహం వుండడమే సుబ్బరాజు పుష్టికి కారణం.

"ఒకప్పుడు జిల్లాలో మకుటంలేని మహారాజుగా, మచ్చలేని రాజకీయవేత్తగా, స్వాతంత్ర్య సమరయోధునిగా వున్న గోపాలకృష్ణయ్య గారిని మరిచిపోవడం ఈ దేశపు దౌర్భాగ్యం. వారికి సరైన గుర్తింపు రాలేదు. వారిని మనం తగురీతిన గౌరవించు

## చక్కని చుక్క

చక్కని చిక్కని చుక్కను / తలచి వలచి పిలిచాను
కలికి కులికి పలికె / చక్కని చుక్కను చిక్కను!!

### 'సమ్'గీతం

పాత పాట ఎంతో మధురం!
మంచి పాట ఈనాటి తెలుగు తెరకు దూరం!!
ఎప్పుడో ఎక్కడో మంచిపాటల సంగీతం!
ఇప్పుడు వినేది మాత్రం 'సమ్'గీతం!!

### నవ్వులపాలు

ఓనాటి తెలుగు సిన్మా హాస్యం
కథలో పాలు పంచుకున్నది!
ఈనాడది అపహాస్యమై/వ్యధతో నవ్వులపాలవుతున్నది!!

### వినో(షా)దాల షామియానాలు!

ఆనాడు ఇంటి ముంగిట
వెలసే తోరణాల పందిరి!
శుభాల వేడుకే అందరిది!
ఈనాటి ఇంటి ముంగిటి షామియానాలు;
వినోదాలో, విషాదాలో తెలియక కలతచెందుతున్నాయి;
ఒక్క క్షణం అందరి వదనాలు!!

### బాబోయ్! టీవీ!!

ఓనాటి భయంకర వ్యాధి టీబీ!
ఈనాటి భయంకర జాడ్యం టీవీ!!
సీరియల్స్‌లో విలన్స్ లాగే చిందిస్తున్నాడు విషం;
మిత్రులతో గడిపేందుకు దొరకదు కదా ఓ నిముషం!!

### 'సినిమా సిత్రం'

నాడు సన్నార పక్ష సిన్మాలకు అడుగడుగునా
సెన్సార్ కత్తెర భయం;
నేడు కత్తెరనే ఇంట్లో మరచి వచ్చే సెన్సారే సిన్మాకు అభయం!
మాటా పాటా ఆటా ఆనాటి నటుల సొంతం;
ఈనాటి తారలకు ఏదీ రాదు కదా ఆసాంతం!!
అరవుగొంతు కురచ డ్రస్ హీరోయిన్ల ఎ(సె)క్సుపోజింగులు!
హీరోల కంప్యూటర్ల మాయాజాల ఫైటింగులు!
గోలగోల 'సమ్'గీతాల కం(పు)పోజింగులు!!;
తీయగలమా మరోసారి అలనాటి ఓ మాయాబజార్?!
ఇప్పటి సిన్మాలు చూడాలంటేనే మనసు బేజార్!!

–యమ్వీ అప్పారావు

## నీ జ్ఞాపకమే

మల్లె సుగంధమై మనసును మైమరపించేదీ
సంపెంగ సౌరభమై మత్తెక్కించేదీ
నీ జ్ఞాపకమే ప్రియా!
ఆ రాత్రి చల్లని వెన్నెల సాక్షిగా
నీ ఎదపై తలదాచి
నీ కౌగిలిలోని వెచ్చదనాన్ని
నా గుండెలనిండా నింపుకున్నాను కదా
ఆ నులివెచ్చని జ్ఞాపకమే ప్రియా
ఇంకా నా మనసును మెలిపెడుతోంది
నీ కలల జడివానలో తడిసిపోతున్నా
నీ స్మృతుల శృతిలో హృదయ లయలో
నే పాడుకుంటున్నా
నీ జ్ఞాపకాల దొంతరల మధ్య
నే నలిగిపోతున్నా
వికసించే మొగ్గమీద హసించే ముత్యమై
ఎప్పుడూ తాజాగా మెరుస్తూ
నీ జ్ఞాపకమే నన్నిలా బ్రతికిస్తోంది ప్రియా!
నువ్వు నవ్వావు ఆ నవ్వుల్లోంచి
ముత్యాలు రాలిపడ్డాయి
వాటన్నింటినీ మాలకట్టి నీకందించాను
మనిద్దరి ముఖాల్లో ఇంద్రధనుస్సులు
జీవితపు లోతుల్లోంచి
ప్రేమను తోడుక్కుంటూ పోదాం.

## స్వప్నం

జిలతారు పరదాల మాటున దాగిన
ఓ అపురూప శిల్పమా
నా మదిలో దోబూచులాడే
ఓ మంచి ముత్యమా
నీ మంజీర నాదంతో
నాలో రాగాలు పలికించిన
ఓ మలయ మారుతమా
నా కళ్ల ముందు కదలాడే ఓ కలల రూపమా
నీ స్నేహ మధువును రుచి చూపించే
ఓ సువర్ణ స్వప్నమా
నన్ను కవితాలహరిలో తేలియాడించి
నువ్వు కరిగిపోకుమా
కరిగి నాలో నిరాశ మిగల్చకుమా.

—ఉలాపు బాలకేశవులు

కోవాలి. వారికి ప్రభుత్వం కనీసం 'పద్మభూషణ' బిరుదైనా ఇచ్చితీరాలి. వారి స్మారకంగా ఓ పోస్టల్ స్టాంపు విడుదల చెయ్యాలి. సముద్రం ఒొడ్డున, వారు సత్యాగ్రహం చేసిన చోట వారి స్మారక స్థూపం నెలకొల్పాలి" అని ఓ స్టేట్‌మెంట్ వదిలాడు సుబ్బరాజు.

మనోడు ఏదో మంచి ఎత్తే ఎత్తాడు అని రాజకీయ రంగంలోని వాళ్లు కండువాలు చాటుచేసుకుని ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు గాని, గోపాలకృష్ణయ్య మీద అభిమానం వున్న జనం మాత్రం సంతోషించారు. సుబ్బరాజును ఆకాశానికెత్తేశారు. పత్రికలూ, టీవీ ఛానళ్లూ సుబ్బరాజు గారి స్టేట్‌మెంట్‌కు విస్తృతంగా ప్రచారం కల్పించాయి. కొన్ని పత్రికలు గోపాల కృష్ణయ్య గారి నిస్వార్థ సేవానిరతి గురించి హార్దికంగా సంపాదకీయాలు రాసి– ఇప్పటికైనా వారికి సరైన గుర్తింపు తేవడం కోసం సుబ్బరాజు లాంటి వాళ్లు పూనుకోవడం ముదావహం అని ముక్తాయించారు. తను కోరుకున్న విధంగా ఘటనలు నడుస్తున్నందుకు సంతోషించాడు సుబ్బరాజు. వారం రోజులాగి మరో ప్రకటన విడుదల చేశాడు. "గోపాలకృష్ణయ్య గారి స్మారక స్థూపం నిర్మాణం కోసం నా విరాళం లక్ష రూపాయలు. దేశంలోని పెద్దవారి దగ్గర్నుంచి ముష్టెత్తి అయినా ఆ స్థూపం నిర్మింపజేస్తాను. రాష్ట్రపతి చేతుల్తోనో, ప్రధాన మంత్రి చేతుల్తోనో దాన్ని ఆవిష్క రింపజేస్తాను" ఈ ప్రకటన మర్నాడు అన్ని పత్రిక ల్లోనూ ప్రముఖంగా వచ్చింది. చాలామంది పెద్దలు మంచి మనస్సుతో సుబ్బరాజుగారి ఈ సత్కార్యాన్ని స్వాగతించారు.

కానీ తాను చాలా పకడ్బందీ ప్రణాళికతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఒక క్లైమాక్సుకు రావాలంటే ఈ వూపు చాలదు. కొంచెం పెద్దయెత్తున హడావుడి చెయ్యాల. బాగా ఆలోచించాడు సుబ్బరాజు. వారం రోజులాగి ఓ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తెచ్చాడు. "వచ్చే నెల్లో గోపాలకృష్ణయ్య గారి జయంతి. ఆ రోజు వారు సత్యాగ్రహం నిర్వహించిన చోటునించి, నియోజకవర్గ కేంద్రం వరకు ఓ మెగా పాదయాత్రలో పాల్గొనాలె. ఆ రోజు నియోజకవర్గ కేంద్రంలో బ్రహ్మాండమైన సభ నిర్వహిద్దాం. రాష్ట్ర మంత్రులనూ, కేంద్ర మంత్రులనూ పిలుద్దాం. ఆ సభలోనే గోపాలకృష్ణయ్య గారి ధర్మపత్నిని సత్కరించుకుందాం." ఇదీ ఆయన ప్రకటించిన కార్యక్రమం. ఈ

కార్యక్రమాల వివరాలు మర్నాడు పేపర్లలోనూ, టీవీల్లోనూ కోలాహలంగా వచ్చాయి. ప్రజల్లో కదలిక మొదలైంది. దేశంలోని ప్రముఖ క్రీడాకారులనూ, కళాకారులనూ రప్పించడానికి నిర్ణయమైంది.

ఇంకేముంది, అభిమానులకు చేతినిండా పని. అందరూ యూనిఫారాల్లాంటి డ్రస్‌లు కుట్టించు కున్నారు. బ్యాడ్జీలు తయారు చేయించి అందరికీ పంచారు. కరపత్రాలు వెదజల్లారు. బ్యానర్లు కట్టారు. పోస్టర్లు అచ్చు వేయించి నియోజకవర్గమంతా అతికిం చారు. జిల్లా కేంద్రంలో కూడా బాగా ప్రచారం చేశారు. కొన్ని వందల మోటారు సైకిళ్లతో ఓ బ్రిగేడ్ తయా రయింది.

గోపాలకృష్ణయ్య గారి జన్మదినం వచ్చింది. కొన్ని వందల కార్లు, మోటారు సైకిళ్లలో ర్యాలీ- ఆయన సత్యాగ్రహం చేసిన చోటికి చేరింది. ఓ మంత్రిగారు కొబ్బరికాయ కొట్టి జెండా వూపి పాదయాత్ర ప్రారంభిం చారు. మంత్రులు, పెద్ద అధికారులు, కార్లలో అభిమాన సంఘాల సభ్యులూ, గోపాలకృష్ణయ్య గారి యెడల నిజంగానే అభిమానం వున్న సామాన్య జనం పాద యాత్రలో పాల్గొన్నారు. ఇరవై కిలోమీటర్ల పాదయాత్ర సాయం కాలానికి పట్నం చేరింది. పట్నం పొలిమేరల దగ్గర్నించి యాత్ర కేరింతలతో సందడిగా సాగింది. సభాస్థలికి చేరింది.

సభాస్థలి వద్ద సినీజనాలు, కళాకారులు, క్రీడాకారులను చూడడానికి జనం ఎగబడ్డారు. వివిధ టీవీ చానెళ్లు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశాయి. పాద యాత్ర సభాస్థలికి చేరేదాకా కళాకారులు జనానికి వినో దం పంచారు.

సభా కార్యక్రమం మొదలైంది. వేదికంతా తానే అయి తిరిగాడు సుబ్బరాజు. మంత్రులను, ఇతర పెద్దలను తానే స్వయంగా వేదికమీదికి ఆహ్వానించాడు. చివరిగా గోపాలకృష్ణయ్య గారి శ్రీమతిని వేదిక మీదికి ఆహ్వానించాడు. ఇద్దరు మహిళా కార్యకర్తలు పట్టుకుని తీసుకురాబోయే, వారించి తానే చకచకా నడుస్తూ వేదిక ఎక్కింది. జనం కరతాళ ధ్వనులు చేశారు. సుబ్బరాజు ఆమెకు వేదిక మీద సాష్టాంగ నమస్కారం చేశాడు. సుశిక్షితులైన అభిమాన సంఘ సభ్యులు చప్పట్లు ప్రారంభించగానే, జనమంతా రెచ్చిపోయి సుబ్బరాజు భక్తికి, నిగర్వానికీ చప్పట్లు మోగించారు.

వేదిక మీద వున్న పెద్దలు ఒక్కొక్కరే క్లుప్తంగా మాట్లాడారు. ప్రతివారూ గోపాలకృష్ణయ్య గారిని గుర్తు

## జనారణ్యం

ఇది జనారణ్యం!
కాదిది "అభయా"రణ్యం!!
యౌవనంలో కన్నూ, మిన్నూ కానక
వ్యామోహంలో పడి, విచక్షణ కోల్పోయి
కాలుజారుతున్న కన్నెపిల్లలెందరో?!
సమాజానికి వెరచి, చెత్త కుండీలకో,
ఆస్పత్రులకో అంకితమిచ్చే
అతి క్రూర మాతలెందరో?!
ఎచ్చోట గాంచినా, ఏ నోట విన్నా
ఎందు కాలిడినా, నరరూప రాక్షసుల
బారిన పడ్డ అతివల ఆక్రందనలే!
ఉద్యోగాలని, సినీమాల్లో వేషాలని
ప్రలోభపెట్టి, ఎరచూపి
'వేశ్యావాటికల'కు అమ్మాయిలను
అమ్మేసే ముఠాలున్నాయిచ్చట!
విషయం తెలిసేలోగా
సర్వం కోల్పోయి
'శ్లేష్మంలో ఈగ'ల్లా
'పద్మవ్యూహం'లో చిక్కిన
దుర్భర పరిస్థితులు!
మూగ వేదనలు! అరణ్య రోదనలు!!

## రాజకీయ నానీలు

చట్ట సభల / ప్రత్యక్ష ప్రసారం!
వికృత చేష్టలకు / నిలువుటద్దమే!?
పదవుంటే కదా / నేతకు విలువ!
లేనినాడు / చచ్చిన కొండ చిలువే!?
మారిన నియోజకవర్గ / రూపురేఖలు!
ప్రతినిధుల్లో / ప్రకంపనలు!?
నాయకులంతా / ఒకే జాతి పక్షులే!
రూపాలే వేరు / కూతలొక్కటే!!
పదవే నేతలకు / అక్షయపాత్ర!
లేకుంటే / ప్రేక్షకపాత్రే!!
నాయకుల మాటలకు
అర్థాలే వేరు!
చేతలే కదా
తారుమారు!!

-కళాప్రియ

చేసుకున్నారు. వారితో తమ పరిచయాన్ని స్మరించారు. ప్రతి ఉపన్యాసానికీ శ్రోతల నుంచి మంచి స్పందన వచ్చింది. చప్పట్లు మోగాయి.

సుబ్బరాజుకు గుండె పట్టనంత సంతోషంగా వుంది. టీవీలు, పేపర్లలో జాతీయ స్థాయిలో తనకు లభిస్తున్న ప్రచారానికి పొంగిపోయాడు. ఎన్నికలు రాబోయే సమయంలో ఇంత జనబాహుళ్యం ముందు తాను ఓ గొప్ప పని చేస్తున్న హీరోగా మారడం వల్ల రాబోయే రాజకీయ లాభాన్ని ఊహించుకుంటున్నాడు.

సభ చివరకు వచ్చింది. గోపాలకృష్ణయ్య గారి శ్రీమతిని తన సందేశం ఇవ్వవలసిందిగా ఆహ్వానించాడు. ఆమెకు మరోసారి దండ వేశాడు. ఆమె దాన్ని తొలగించబోతుంటే వారించి, దండ వేసుకునే మాట్లాడాల్సిందిగా కోరాడు.

ఆ వృద్ధురాలు మైక్ దగ్గరకు వచ్చి జనానికి అభివాదం చేసింది. జనం నుంచి కరతాల ధ్వనులు.

"నాయనలారా, నేను పెద్దదాన్నయ్యాను. చాలాసేపు మాట్లాడే ఓపిక నాకు లేదు. ఇంతదాకా మాట్లాడినవాళ్లంతా మా ఆయన్ను గురించి నాలుగు మంచి ముక్కలు మాట్లాడారు. అందుకు వందనాలు. గోపాలకృష్ణయ్య గారికి అన్నదమ్ములెవరూ లేరు. మీటింగులనీ, సత్యాగ్రహమనీ, స్వతంత్రమనీ – ఉన్న కొంచెం ఆస్తినీ కరిగించేశాడు. రాజకీయాల్లో చేరి ఓ రూపాయ సంపాదించుకుందామని ఆయన ఏనాడూ అనుకోలేదు. ఆయనతో అన్నిచోట్లకీ నేనూ తిరిగాను. సబర్మతి ఆశ్రమంలో, వార్ధా ఆశ్రమంలో కొన్ని రోజులున్నాం. ఆశ్రమంలో గాంధీ గారు మాకు మరుగుదొడ్లు శుభ్రం చేసే పని ఇస్తే చేశాం. మా ఆయన చాలాసార్లు జైలుకు వెళ్ళారు. మాకు పిల్లలు లేరు. మేం కలిసి కాపురం చేసిన రోజులు చాలా తక్కువ. అందుకు మేం బాధపడలేదు. స్వతంత్రం వచ్చి, స్థిమితపడ్డాం అనుకునేసరికి పెద్దవాళ్లయిపోయాం. ఏవో పైరవీలు చేసుకుంటే ఆయనకూ ఓపదవి వచ్చేదే. కానీ ఆయన ఏ పదవీ కోరుకోలేదు. పదిహేనేళ్లయింది ఆయన చనిపోయి. ఉద్యోగం లేక, ఆస్తి లేక, పలకరించే వాళ్లు లేక దిక్కులేని చావు చచ్చాడాయన. గవర్నమెంటు ఇచ్చే పెన్షన్‌తో ఒక పూట తిని బ్రతుకుతున్నాను నేను. ఇంత కాలానికి ఇప్పుడాయనకు బిరుదులెందుకు, స్టాంపులెందుకు. ఎప్పుడో గవర్నమెంటు రెండెకరాలు ఇచ్చింది మాకు. అదేమైందో తెలుసుకోవాలని వుందా మీకు. (సుబ్బరాజును చూపిస్తూ ఇదుగో ఈ పెద్దమనిషే కబ్జా చేయించాడు దాన్ని. ఆ సంగతి చెప్పుకోడానికి పోతే నన్ను ఇంట్లోకి రానియ్యలేదు. ముసలిదాన్నని కూడా చూడకుండా ఆయన రౌడీలు నన్ను మెడబట్టి బైటికి గెంటారు. ఇవ్వాళ ఈయనకు వోట్లు కావాల్సి వచ్చేసరికి గోపాలకృష్ణయ్య గారు జ్ఞాపకం వచ్చారు. దేశం బాగుండాలంటే, ఇట్లాంటి దొంగ నాయకులను మీరంతా ఒక కంట కనిపెట్టి వుండాలి. సమయమొచ్చినప్పుడు బుద్ధి చెప్పాలి. మీ అందరికీ నమస్కారం" అని, మెడలో వున్న దండను తెంపి, వేదిక మీదకు విసిరేసి చకచకా నడుచుకుంటూ వేదిక దిగి వెళ్లిపోయింది.

■

## అంకురార్పణ

ఒకనాడు
మొక్కై మొలకెత్తాను, పూసాను, కాసాను
పండ్లిచ్చాను, పక్షులకి గూడిచ్చాను
మనిషికి ఇంధనమిచ్చాను, శ్వాసనిచ్చాను
ఇవాళ- పండుటాకుల్తో మిగిలిపోయాను
నా కొమ్మలమీది గూళ్లుబోసిపోతున్నాయి
అది వియోగ మాధుర్యం – అది విషాద మోహినం
అయినా జ్ఞాపకాల కొమ్మలున్నాయి నాకు
ఈ వయస్సు నాకు తమస్సు కాదు
ఇది ఒక తపస్సే
గాలి అలల కలలు నన్ను పలకరిస్తూనే ఉంటాయి
చుట్టూ నా నేస్తాలున్నాయి-
ఆ నేస్తాల దగ్గర గూళ్లు- పక్షి కూనల కేరింతలు
పులకరింతలు పెడుతూనే ఉంటాయి.
బాటసారులకు నీడనిస్తూనే ఉన్నా
నా దేహం వంట చెరకుకూ- కలపకూ
పనికొస్తుంది; అది నా కానందం కాదా!
మొక్క-మాను-మోడు- ఈ దశలో మామూలే!
నీవూ అంతే
వృద్ధాప్యం నేరమూ కాదు, శాపమూ కాదు
నీ ఆధ్యాత్మిక జీవన వసంతం నీ సొంతం
నీ ప్రేమయుగానికీ, వైరాగ్య భాగ్యానికిదే
శుభారంభం.
నీ వాత్సల్య పుష్కర స్నానానికీ, మౌనగానానికీ
ధ్యాన యోగానికీ ఇదే అంకురార్పణ!

–చిమ్మపూడి శ్రీరామమూర్తి